క్లుప్తంగా

కార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో బాలబాట



తెనాలిరూరల్: కమ్యూనిటీ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ(కార్డ్స్) సంస్థ ఆధ్వర్యంలో అంగలకుదురు గ్రామంలో బాలబాట కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. విద్యార్థులకు ఆటపాటలతో చదువు నేర్చుకోవడంపై అవగాహన కల్పించారు. తెనాలి డివిజన్ రూరల్ లెప్రసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్యామ్ ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్యార్థుల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు సంస్థ డైరెక్టర్ కె.మేరి తెలిపారు. డిప్యూటీ డైరెక్టర్ ఆర్.అనిత, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో జేఎంజే విద్యార్థినుల సత్తా

తెనాలి: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో స్థానిక జేఎంజే మహిళా కళాశాల విద్యార్థినులు చక్కటి ఫలితాలను సాధించినట్లు వ్యాయామ అధ్యాపకురాలు అరుణ సుజాత తెలియజేశారు. ఈనెల 13, 14 తేదీల్లో జరిగిన పోటీల్లో కాలేజీ ఫైనలియర్ బీకాం (కంప్యూటర్స్) విద్యార్థిని డి.హేమలత హైజంప్‌లో బంగారు పతకం, ట్రిపుల్ జంప్‌లో రజత పతకం, 400/100 మీటర్ల రిలేలో రజత పతకం సాధించినట్లు తెలిపారు. ఫైనలియర్ బీఎస్సీ విద్యార్థిని కె.రూప హైజంప్, 400/100 మీటర్ల రిలేలో రజత పతకాలను, బి.కవిత, బి.దుర్గలు 400/100 మీటర్ల రిలేలో రజత పతకాలను సాధించినట్లు వివరించారు. వీరిని కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ షైని కేపీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మేరీశారద అభినందించారు.

తోపుడు బండి వితరణ



తెనాలి: పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవాసంస్థ యంగ్ జనరేషన్ టీమ్‌చే ఆదివారం రమణ అనే యువతికి తోపుడుబండిని అందజేసి, పూలవ్యాపారం ప్రారంభింపజేశారు. గతంలో ఆమె తల్లి విజయమ్మ పట్టణ టౌన్‌చర్చి వద్ద తోపుడుబండిని సమకూర్చి పూలవ్యాపారానికి సహకరించారు. ఇప్పుడు విజయమ్మ కోరికపై ఆమె కుమార్తెకూ జీవనోపాధికి సహకరించినట్టు యంగ్ జనరేషన్ టీం అధ్యక్షుడు సాదిక్ వెల్లడించారు. కార్యక్రమంలో సాదిక్‌తోపాటు రుషిత, ప్రముఖ న్యాయవాది హరిదాసు గౌరీశంకర్, శివ, నవీన్, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

జేఎంజే స్వధార్‌లో 'రిమెంబర్ డిసెంబరు'



తెనాలి: తెనాలి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ ఏటా నిర్వహిస్తున్న 'రిమెంబర్ డిసెంబరు' కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. స్థానిక జేఎంజే స్వధార్‌లో 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు 'పరీక్షలను ఎదుర్కోవటం ఎలా' అనే అంశంపై తెనాలి రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ టి.వెంకటరమణ అవగాహన కల్పించారు. నిరుపేదలకు చేయూతను అందించటంలో భాగంగా, జేఎంజే స్వధార్ పాఠశాల, కాలేజీ విద్యార్థులు అరవై మందికి చెప్పులు, మానసిక, శారీరక వికలాంగులకు కాన్వాస్ చెప్పులు అందజేశారు. హృదయమేరీ, అచ్యుత సాంబశివరావు, రాజేంద్రకుమార్ రెడ్డి, దీప్తి, దుర్గా, హవీలా, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిరూరల్ : విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలపై జోక్యం చేసుకోవాలని, పోరాట కమిటీ నాయకులు కూరపాటి స్టీవెన్ కోరారు. ఆదివారం బ్రహ్మనందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి, మాట్లాడారు. కార్మికులు తమకు రావలసిన బకాయిల కోసం దీక్షలు చేపట్టి 12 రోజులు అయ్యాయని, మంత్రి నారా లోకేష్ ఈ విషయంలో జోక్యం చేసుకుని కార్మికుల సమస్యను పరిష్కరించే దిశగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వి.వెంకటేశ్వరరావు, బి.అంకయ్య, కె.ఆదినారాయణ, ఎం.గురవయ్య, ఎ.నాగేశ్వరరావు, ఎస్.సుబ్బారావు, కె.సీత, వై.లక్ష్మి, డి.రమణ, నవనీతం, దుర్గాభవాని పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి భజన

పొన్నూరు: మండలంలోని మామిళ్లపల్లిలో ఆదివారం అయ్యప్పస్వామి భజన, అభిషేకం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మణికంఠుడి నామస్మరణతో ప్రాంగణమంతా మార్మోగింది. అనంతరం అయ్యప్పస్వామికి సద్ది వితరణ గావించారు.

జాగ్రత్తగా ముందుకు సాగు!

- మొక్కజొన్న, జొన్న పంట సాగుకు సమాయత్తమైన రైతాంగం
- విత్తన ఎంపిక, కొనుగోళ్లపై అవగాహన అవసరం
- అప్పుడే పంటలో అధిక దిగుబడి, లాభాలు
- తెనాలి ఏడీఏ ఉషారాణి



కొల్లిపర మండలంలో మొక్కజొన్న విత్తనాలు విత్తుతున్న రైతులు

కొల్లిపర: ప్రస్తుతం రైతులు ఖరీఫ్ వరి కోతలు పూర్తి చేసుకొని రబీసాగు పనుల్లో బిజీగా ఉన్నారు. తెనాలి నియోజకవర్గంలో తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లో మాగాణి భూమిలో 44 వేల ఎకరాలలో మొక్కజొన్న, జొన్న, సాగుకు సిద్ధంగా ఉన్నాయి. విత్తనాల ఎంపిక, కొనుగోళ్లలో జాగ్రత్తలు, ఏ భూమిలో ఏ పంట వేయాలి, ఏ కంపెనీ విత్తనాలు కొనుగోలు చేయాలి, ఏ పంటకు గిట్టుబాటు ధర ఉంటుందనే అంశాలపై రైతులకు తెనాలి ఏడీఏ ఉషారాణి పలు సూచనలు చేశారు..



తెనాలి ఏడీఏ ఉషారాణి

గమనించాల్సిన అంశాలు...

- విత్తనాల ఎంపిక పంటల దిగుబడిలో కీలకమైంది. సరైన విత్తనాలను ఎంపిక చేయడం ద్వారా అధిక, నాణ్యమైన దిగుబడి పొందొచ్చు.
- భూమి, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉండే పంట రకాలను మాత్రమే ఎంచుకోవాలి.
- రైతులు ఎంచుకునే విత్తనాలు వారి పంట రకానికి అనుగుణంగా ఉండాలి. ఉదాహరణకు నీటి వనరులు తక్కువ ఉండే ప్రాంతాల్లో నీటి ఎద్దడిని తట్టుకునే రకాలు, తక్కువ నీటితో ఎదిగే రకాలను ఎంపిక చేసుకోవాలి. అధిక వర్షపాతం ప్రాంతాల్లో నీరు ఎక్కువ కాలం పొలంలో నిలిచి ఉంటుంది. ఇలాంటి పరిస్థితిని తట్టుకునే రకాలను, తడిని తట్టుకునే రకాలను ఎంచుకోవాలి.
- పాత విత్తనాలకంటే తాజా గత పంటకాలంలో ఉత్పత్తి చేసిన విత్తనాలను కొనుగోలు చేయడం ఉత్తమం. తెగుళ్లు, పురుగులను తట్టుకునే రకాలను ఎంపిక చేసుకోవాలి.

రోగ నిరోధకత..

- రోగ నిరోధక శక్తి కలిగిన విత్తనాలను ఉపయోగించడం ద్వారా పంటలకు రోగాల నుంచి రక్షణ కల్పించొచ్చు.
- అధిక దిగుబడిని అందించే రకాలను ఎంపిక చేసుకోవడం ద్వారా లాభాలు పెంచుకోవచ్చు.
- గడువు దాటిన విత్తనాలను తక్కువ రేటుకు వస్తుంది అని భావించి ఎట్టి పరిస్థితులలో కొనుగోలు చేయెుద్దు, ప్యాకింగ్ తేదీ, గడువు తేదీని సరిచూసుకోవాలి. కొనుగోలు చేసిన విత్తన ప్యాకెట్ సంచి, డబ్బాలపై సీలు ఉందా లేదా అని సరిచూసుకోవాలి. విత్తన ప్యాకెట్లపై ముద్రించిన సమాచారాన్ని బిల్లులో ఉన్న వివరాలతో సరిచూసుకోవాలి. రైతు కొనుగోలు చేసే సమయంలో కొనదలచిన రకం, వంగడం, హైబ్రిడ్ లక్షణాలను డీలర్ దగ్గర తెలుసుకుని, ఏదైనా కరపత్రం తీసుకోవడం ద్వారా క్షేత్రస్థాయి ఇబ్బందులు కొంత వరకు ఎదుర్కోవచ్చు.

విత్తన నమూనా పరీక్షలు ఇలా...

- పంట విత్తుకునే ముందు కొనుగోలు చేసిన విత్తనాల నుంచి కొన్నింటిని తీసుకుని మొలక శాతం పరీక్షించుకోవాలి.
- మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అధికంగా అమ్మకాల అవకాశాలు ఉన్న పంట రకాలను ఎంచుకోవాలి.
- వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- నిర్ణీత ఫార్మాట్‌లో ఉన్న బిల్లు(రసీదు) అనగా దుకాణదారుడి అడ్రస్, పేరు, సీడ్ లైసెన్స్ నంబర్, జీఎస్టీ నంబర్, తదితర వివరాలు ఉన్న పత్రానే రసీదుగా అంగీకరించాలి.
- నకిలీ విక్రయదారుల నుంచి ఎట్టి పరిస్థితుల్లో విత్తనాలు కొనుగోలు చేయెుద్దు.
- విత్తన కొనుగోలు బిల్లులో కొనుగోలు చేసిన విత్తన వివరాలు అనగా పంట పేరు, రకం, తయారుదారీ పేరు, లాట్ నంబర్, గడువు తేదీ తప్పనిసరిగా సరిచూసుకోవాలి.
- విత్తన కొనుగోలు బిల్లులో అమ్మకందారు సంతకం, కొనుగోలుదారు సంతకం తప్పనిసరిగా ఉండాలి. విత్తన కొనుగోలు బిల్లు, విత్తన ప్యాకెట్లను పంట కాలం ముగిసి పంట చేతికి వచ్చేవరకు భద్రపరుచుకోవాలి. లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు డబ్బాల్లో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయెుద్దు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



ఆధారాల కోసం ప్రయత్నిస్తున్న క్లూస్ టీం

తెనాలిరూరల్: మండలంలోని కొలకలూరు గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. గ్రామంలోని మంటపం బజారుకు చెందిన వేజండ్ల శివనాగేశ్వరరావు కుటుంబంతో కలసి ఢిల్లీలో ఉంటున్నారు. గ్రామంలోని వీరి ఇంటికి అప్పుడప్పుడు వచ్చి వెళుతుంటారు. గుర్తు తెలియని దుండగుడు శనివారం అర్ధరాత్రి దాటాక ఇంటి ఆవరణలోకి ప్రవేశించి తాళం పగులగొట్టి ఇంట్లోకి వెళ్లాడు. ఇంటికి ఏర్పాటు చేసిన సీసీ కెమెరా దుండగుడి ఫోటో తీసి యజమానికి పంపింది. అలానే దుండగుడు చోరీకి పాల్పడుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి. ఆదివారం ఉదయం తలుపు తెరచి ఉండడాన్ని గమనించిన స్థానికులు శివనాగేశ్వరరావుకు సమాచారం అందించగా ఆయన సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించి ఇదే విషయాన్ని రూరల్ పోలీసులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్ ఇంటిని పరిశీలించారు. గుంటూరు నుండి వచ్చిన క్లూస్ టీం ఆధారాలు సేకరించేందుకు ప్రయత్నించింది. ఇంట్లో కొన్ని వెండి వస్తువులు చోరీకి గురయినట్లు ఎస్ఐ తెలిపారు.

అమరజీవి త్యాగం.. చిరస్మరణీయం

పొట్టి శ్రీరాములుకు ఘననివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ఆంధ్రరాష్ట్ర సాధనకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. ఆయన పోరాట దక్షత, పట్టుదల యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత స్వార్థం కోసం కాకుండా సమాజ శ్రేయస్సుకు జీవితాన్ని అంకితం చేసిన శ్రీరాములును ఆదర్శంగా విలువల ఆధారిత సమాజం కోసం అందరూ కృషిచేయాలని చెప్పారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి రోజైన ఆదివారం స్థానిక బోసురోడ్డులోని ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు త్యాగాలను స్మరించుకున్నారు. తెనాలి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు, ఆర్యవైశ్య ప్రముఖులు అచ్యుత సాంబశివరావు, పొన్నూరు శ్యామలరావు, చుండూరు సాయి, రఘునాథగుప్త, పొత్తూరు రాఘవ, జూటూరు శ్రీనివాసు, ఆలమూరి ఫణి, ఓకే కృష్ణ, చుండూరు వెంకటేశ్వరరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జలగం రామకృష్ణ, పెసర్లంక రమణ, కాళిదాసు వెంకటేశ్వరరావు, కొడాలి క్రాంతి, భాస్కరుని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో...

ఆంధ్ర రాష్ట్ర అవతరణకి మూలపురుషుడైన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ చందు సాంబశివుడు పూలమాలవేసి నివాళులర్పించారు. పార్టీ తెనాలి పట్టణ అధ్యక్షుడు పొన్నూరు నాగ సూర్యశేఖర్‌రావు, తెనాలి రూరల్ మండల అధ్యక్షుడు కర్లపూడి బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు

అమరజీవి స్మృతి పరిరక్షణ సమితిచే...

అమరజీవి పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి, గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో రైల్వేస్టేషను రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 200 మంది పేదలకు అన్నదానం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మాజీ ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్‌కుమార్, అమరజీవి పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి, జిల్లా శాఖ ఉపాధ్యక్షుడు ఆలపాటి శివనరసింహారావు, చుండూరు సాయి, ప్రధాన కార్యదర్శి, జిల్లా కో–ఆర్డినేటర్ బింగమళ్ల పృథ్వి, కోనా నాగేశ్వరావు, మద్దాళి రామకృష్ణ, తడవర్తి మురళీకృష్ణ, గునుపాటి వెంకయ్య, పొన్నూరు శివరామకృష్ణ పాల్గొన్నారు. సమితి పట్టణ కమిటీ అధ్యక్షుడుగా మద్దుల రామమోహనరావు, కార్యదర్శిగా దాగిపర్తి సత్యనారాయణ, కోశాధికారిగా కోట పున్నారావుకు నియామక పత్రాలను ఇక్కడే అందజేశారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో...

పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మారీసుపేటలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. అధ్యక్షుడు గోనుగుంట్ల శ్రీను, బూర్లగడ్డ రామకృష్ణ, చక్కా చెన్నకేశవరావు, చీమకుర్తి సుబ్రహ్మణ్యం, పద్మనాభుని కార్తి, మాడిశెట్టి కోటేశ్వరరావు పాల్గొన్నారు. గన్నవరంలోని విమానాశ్రయానికి పొట్టి శ్రీరాములు పేరిట నామకరణం చేయాలని డిమాండ్ చేశారు.

గుప్త డిగ్రీ కాలేజీలో...

ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని ఎస్‌ఆర్‌కే అండ్ కేఎస్‌ఆర్ గుప్త డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ గోగినేని విజయలక్ష్మి అన్నారు. ఆదివారం గుప్తా డిగ్రీ కాలేజీలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. విద్యాసంస్థల మేనేజరు డి.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎం.దశరథరామిరెడ్డి, కేవీ రవికుమార్, షేక్ రఫీ, టీజీ కళావతి, ఆర్‌వీ సునీత, ఎ.బాలగోపాల్, శ్రీకాంత్, ఎం.లక్ష్మి, సీహెచ్ నాగార్జున, రవిచంద్ర, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కొల్లిపరలో...



కొల్లిపర ఆర్యవైశ్య సంఘం నిలయం వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళి

కొల్లిపర: పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగంతోనే ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని కొల్లిపర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అన్నవరపు రమేష్ అన్నారు. ఆదివారం కొల్లిపర గ్రామ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు అన్నవరపు రమేష్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం జరిగింది. స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసిన నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్నవరపు రమేష్ మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు కోసం ఆయన చేసిన అనేక త్యాగం తరతరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. కొల్లిపర మండల అధ్యక్షుడు ములగాల రామలక్ష్మణరావు, కార్యదర్శి చుండూరు వెంకటరత్నం, కోశాధికారి కాజ ప్రసాద్, ఉపాధ్యక్షులు దాసరి వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్యులు సుగ్గుల సురేష్‌కుమార్ పాల్గొన్నారు.
– స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి పాల్గొన్ని పొట్టిశ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ అసిస్టెంట్ మూర్తి , ఈఓపీఆర్డీ భార్గవ, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



ర్యాలీలో డీఎస్పీ జనార్ధనరావు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది

తెనాలిరూరల్: ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సైబర్ నేరాల అవగాహన కార్యక్రమంలో భాగంగా తెనాలి సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో పట్టణ మార్కెట్ వంతెన వద్ద నుంచి చెంచుపేట ఉమేష్ చంద్ర విగ్రహం వరకు ఆటోలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ తెనాలిలో పలువురు సైబర్ నేరాల బారిన పడి మోసపోయారని, మధ్య వయస్కులు, వృద్ధులు ఎక్కువగా మోసపోతున్నారని తెలిపారు. ఓటీపీలు చెప్పడం, కేవైసీ అప్‌డేట్ చేయడం, అధిక లాభాలు వస్తాయని మ్యూచువల్ ఫండ్స్‌లో ఎక్కువగా పెట్టుబడులు పెట్టడం వంటి వాటి ద్వారా ఎక్కువగా సైబర్ నేరాల బరిన పడుతున్నారని, వీటి నియంత్రణలో భాగంగా అవగాహన ర్యాలీ చేపట్టినట్లు డీఎస్పీ జనార్ధనరావు తెలిపారు. సీఐలు ఎస్.రమేష్‌బాబు, వి.మల్లిఖార్జునరావు, రాములు నాయక్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తే చర్యలు

నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీనివాసులు



భవనాలను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నూతనంగా నిర్మాణం చేసే బహుళ అంతస్తు భవనాలు రోడ్ల మీదకు ర్యాంప్‌లు, డ్రెయిన్లపై నిర్మాణాలు చేయకుండా, డ్రెయినేజీ లైన్‌ని మేజర్ డ్రెయిన్‌లోకి కనెక్ట్ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేసిన భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) జారీ చేయబోమని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఆదివారం గోరంట్ల, రెడ్డిపాలెం ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, సెట్ బ్యాక్, రోడ్ల కొలతలు, ర్యాంప్‌లను తనిఖీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘన చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నామని చెప్పారు. భవనాలు నిర్మాణ దశలోనే వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిరంతరం పరిశీలిస్తూ, నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టకుంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి, నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. రోడ్ల మీదకు ర్యాంప్‌లు, డ్రెయిన్ల ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే నిర్మాణం చేసిన వాటిని తొలగించాలని స్పష్టం చేశారు. ప్రధానంగా సెట్ బ్యాక్ పోర్షన్‌లో ఏ విధమైన నిర్మాణాలు చేయకూడదని, జనరేటర్లు కూడా పెట్టడానికి వీలు లేదన్నారు. గ్రీనరీకి ప్లాన్‌లో చూపిన విధంగా ఉండాలన్నారు. వాచ్‌మెన్ రూమ్ నగరపాలక సంస్థ నుంచి అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. అపార్ట్‌మెంట్ నిర్వాహకులే డ్రెయినేజీ లైన్‌ను మేజర్ డ్రెన్ వరకు కనెక్ట్ చేసుకోవాలని కోరారు. పర్యటనలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ మల్లికార్జున, టీపీఎస్ లక్ష్మణ స్వామి పాల్గొన్నారు.

జీఓ 143 రద్దు చేయాలి

టీఎన్‌టీయూసీ డిమాండ్

గుంటూరు మెడికల్: తెలుగు నాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ టీఎన్‌టీయూసీ అనుబంధం గుంటూరు జిల్లా సర్వసభ్య సమావేశం యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన ఆదివారం గుంటూరు అరండల్‌పేటలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచార్యులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. భానుమూర్తి, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి వెంకటలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో గందరగోళానికి కారణమైన 143 జీఓను వెంటనే రద్దు చేయాలని కోరారు. జీఎన్ఎమ్ ట్రైనింగ్ పూర్తి చేసిన వారికి ప్రమోషన్ ఇవ్వాలని, రాష్ట్రవ్యాప్తంగా ఎల్ హెచ్‌వీ ట్రైనింగ్‌కు అనుమతి ఇవ్వాలని, క్షేత్రస్థాయి సిబ్బందికి ఎఫ్‌ఆర్ఎస్ నుంచి మినహాయించాలని, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. 1207 జీవో ద్వారా తొలగించిన ఎంపీహెచ్ఏఎం ఉద్యోగులందరిని మానవతా దృక్పథంతో విధుల్లోకి తీసుకోవాలని, వెంటనే 12వ పీఆర్సీ కమిటీ వేసి ఐఆర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. .

జిల్లా అధ్యక్షుడిగా అప్పారావు....

సమావేశానంతరం గుంటూరు జిల్లా తెలుగు నాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎం.అప్పారావు, కార్యదర్శిగా టి.రామసీత, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా టి.శ్రీనివాసరావు, కోశాధికారిగా ఎస్ ఎస్ సురేష్ కుమార్, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్‌గా షేక్ మహమ్మద్ సుభాని, వైస్ ప్రెసిడెంట్‌గా డి మాధవి, డి.శ్రీ లక్ష్మి, ఎం.నిర్మల జ్యోతి, అనూష, జాయింట్ సెక్రెటరీగా జి.కృష్ణవేణి, ఎం.సుజాత, జి.నళిని, డి.రాజ్యలక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేటి నుంచి ధనుర్మాస మహోత్సవాలు

ఆలయ కార్యనిర్వహణాధికారి శిరీష

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని వేణుగోపాలస్వామి, సీతారామస్వామి వార్ల దేవస్థానంలో దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీ వేణుగోపాల స్వామి భక్త బృందం సహకారంతో సోమవారం నుంచి జనవరి 13వ తేదీ వరకు ధనుర్మాస మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.శిరీష తెలిపారు. జనవరి 10వ తేదీన శ్రీ వైకుంఠ ఏకాదశి(ముక్కోటి) ఉత్తర ద్వార దర్శనం, 11న కుడారై ఉత్సవం, 13న భోగి పండుగ, 14న మకర సంక్రాంతి, 15న కనుమ పండుగలను ఆలయంలో ఘనంగా శాస్త్రోక్తంగా జరపనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా సోమవారం నుంచి ధనుర్మాసం ముగిసే వరకు ప్రతి రోజూ తెల్లవారుజామున తిరవారాధన, తిరుప్పావై సేవా కాలం, నివేదన కార్యక్రమాలు ఆలయ అర్చకులు వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు శిరీష వివరించారు. నేటి నుండి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ప్రధాన గోపురం విద్యుత్ దీప కాంతులతో ధగధగలాడుతుంది.

సత్ప్రవర్తనతో మెలగకుంటే కఠిన చర్యలు

తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ

తాడికొండ: రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగకపోతే చర్యలు తప్పవని తుళ్లూరు డీఎస్పీ మురళీ కృష్ణ హెచ్చరించారు. ఆదివారం తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వివాదాలు, సెటిల్ మెంట్లలో జోక్యం చేసుకుంటే ఇబ్బందులు తప్పవన్నారు. ఎక్కడైనా వివాదాల్లో తలదూర్చినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సీఐలు గంగా వెంకటేశ్వర్లు, అంజయ్య పలువురు ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న నందం అబద్దయ్య తదితరులు

తాడేపల్లిరూరల్: ఆత్మకూరులో వేంచేసిన శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పద్మశాలీయ బహుత్తమ సంఘం చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ పాలక మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి దంపతులు విచ్చేసి, పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి భక్త బృందం సభ్యులు మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో గణపతి, శాంతి, మృత్యుంజయ హోమాలు నిర్వహించామని తెలిపారు. సుమారు 20 మంది దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొననగా, ఐదుగురు వేద పండితులు హోమాది కార్యక్రమాలు నిర్వహించారని పేర్కొన్నారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు తాటి వెంకటరావు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కొమ్మా సుకుమార్, జనసేన నాయకులు కట్టా కృష్ణ, శానం మాణిక్యరావు, గూడపాటి వీరతేజ, మోతుకూరి రవి, శ్రీ వీరభద్రస్వామి భక్తబృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగు

ప్రత్తిపాడు: భూసార పరీక్షల ఆధారంగా రైతులు పంటలను సాగు చేసుకుంటే సత్ఫలితాలుంటాయ ని వ్యవసాయ విద్యార్థినులు రైతులకు వివరించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా వట్టిచెరుకూరులో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. రైతులు తమ భూముల నుంచి శాస్త్రీయంగా మట్టిని సేకరించి సమీపంలోని వ్యవసాయ ప్రయోగశాలల్లో అందించాలని కోరారు. పరీక్షల ఆధారంగా భూమిలో పంటలకు కావాల్సిన పోషకాలు ఉన్నాయా లేదా అన్నది తెలుసుకోవచ్చని చెప్పారు. పరీక్షల ఆధారంగా పంటలను సాగు చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. అధిక మోతాదులో రసాయనిక ఎరువులు వినియోగించడం వలన భూసారం తగ్గి, పెట్టుబడుల భారం అధికమవుతుందని తెలిపారు. అనంతరం పొలంలో మట్టి సేకరించే విధానాన్ని ప్రయోగాత్మకంగా రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థినులు గాయత్రి, ముస్కాన్ కుమారి, హ్యాపి సహజ, గీతాభవాని, సాహితి, బృంద, అభినయశ్రీ పాల్గొన్నారు.